క్లుప్తంగా

బాపూజీకి పురస్కారం

అద్దంకి రూరల్: అద్దంకికి చెందిన కొండముది బాపూజీకి తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ తెలుగుసాహితీ మహానంది జాతీయ పురస్కారం- 2025 దక్కింది. శనివారం వరంగల్‌లో అందుకోనున్నట్లు శుక్రవారం ఆయన తెలిపారు. సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు ఈ పురస్కారం రావడంతో పలువురు అభినందించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నేడు

కారంచేడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు పార్టీ కారంచేడు మండల అధ్యక్షుడు జువ్వా శివరాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 4 గంటల నుంచి మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో శ్రీవెంకటేశ్వర కమ్యూనిటీ హాలులో జరిగే 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమం పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూధనరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అంతా తప్పకుండా హాజరుకావాలని కోరారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం తగదు



బల్లికురవలో బీఎల్‌వోతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ

బల్లికురవ: బీఎల్‌వోలు ఎన్నికలకు సంబంధించిన విధులు సమర్థవంతంగా నిర్వహించాలని అద్దంకి నియోజకవర్గ ఈఆర్‌ఓ సీహెచ్ విజయ జ్యోతికుమారి కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో బీఎల్‌వోలతోజరిగిన సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో లోపాలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చనిపోయిన వారిని తొలగించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుతోపాటు ఓటు హక్కు పొందిన వారికి ఓట్లు వేసేవిధంగా అవగాహనతో చైతన్య పరచాలన్నారు. తహసీల్దార్ రవినాయక్ మాట్లాడుతూ ఓటుకు ఆధార్ అనుసంధానంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. ఎన్నికల డీటీ సుబ్రహ్మణ్యం మాట్లాడారు.

లింకు రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు

బల్లికురవ: మండలంలో ప్రధానమైన లింకు రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు తయారుచేసి పంపినట్లు పంచాయ్‌రాజ్ ఏఈ కె. మాధవ్ శుక్రవారం తెలిపారు. కొణిదెన-గంగపాలెం-వేమవరం జంక్షన్ - ఉప్పుమాగులూరు లింకు రోడ్ల అభివృద్ధి రూ. 4.5 కోట్లు, కొప్పరపాలెం -కోటవారిపాలెం లింకురోడ్డుకు రూ.2 కోట్లు, కొణిదెన-నాగరాజుపల్లె లింకురోడ్డు అభివృద్ధికి రూ. 2 కోట్లతో అభివృద్ధి పరిచేందుకు ప్రతిపాదనలు తయారుచేసి పంపినట్లు చెప్పారు. మేదరమెట్ల -నార్కెట్ పల్లి నామ్ రహదారిలోని కొప్పరపాడు నుంచి కొత్తూరు-వెలమవారిపాలెం- జమ్ములమడక కాలనీ వరకు లింకురోడ్డు అభివృద్ధికి నాబార్డులో రూ. 4.75 కోట్లు నిధులు మంజూరైనట్లు చెప్పారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

చీరాల టౌన్: ఇళ్లల్లో నుంచి వచ్చిన చెత్తను రోడ్లపై వేసేవారిపై చర్యలు తీసుకుంటామని గ్రామాల ప్రజలు చెత్తను పంచాయితీ గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని ఈపురుపాలెం పంచాయతీ కార్యదర్శి మురళీబాపూజీ సూచించారు. ఈపురుపాలెంలో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన ప్రాంతాలైన పద్మనాభుని పేట, గాంధీపార్కు, సీతారాంపేట, నలభై ఇళ్ల కాలనీ, ఇందిరానగర్, బావనారుషిపేట తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్మూలన చేపట్టారు. సీజనల్ వ్యాధులకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై గ్రామ ప్రజలకు సూచనలందించారు. కార్యదర్శి మురళీబాపూజీ మాట్లాడుతూ నివాస గృహాల నుంచి వచ్చే చెత్తను, మురుగునీటిని రోడ్లపైకి రాకుండా ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

డిమాండ్ల సాధన కోసం సమ్మె



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

అద్దంకి: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈనెల 13 నుంచి నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం అద్దంకి బంగ్లా రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్మికులకు గత 30, 40 సంవత్సరాల నుండి రిటైర్మెంట్ వచ్చేవరకు పనిచేసిన రూ.13 నుంచి రూ.15 వేల వేతనం ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ పరంగా అమలయ్యే తల్లికి వందనం .. ఇతర అన్ని రకాల సంక్షేమ పథకాలు కూడా అమలు కావడం లేదన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి. ఆదాం, సీఐటీయూ నాయకులు తోట వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు పి. జాన్ ఉసిరిపాటి సామ్యూల్ కోశాధికారి మారుతి జాషువా మార్కు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ఎండమావేనా?



కారంచేడు ప్రాంతంలో సాగు సిద్ధం చేసిన వరి చేలు



అద్దంకిలో పొలం దుక్కి దున్నుతున్న రైతు

- తొలకరి చినుకులు పడినా నిండని కుంటలు
- ఖరీఫ్ పంటలపై సన్నగిల్లుతున్న ఆశలు

కారంచేడు/అద్దంకి: అన్నదాతలను ప్రకృతి ఎప్పుడూ సంతోషంగా ఉండనీయదు. అయినా అందరికీ పట్టెడన్నం పెట్టాలనే లక్ష్యాన్ని వారు ఏనాడూ విడవరు. జూలై నెల సగం కావస్తున్నా ఖరీఫ్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. బాపట్ల జిల్లాలో సుమారు 3.5లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. వరి, మిరప, శనగ, పత్తి, పొగాకు, మొక్కజొన్న, మినుము, పెసర వంటివి ఇక్కడ సాగుకు అనుకూలంగా ఉంటాయి. కానీ ఏ సీజన్‌లో ఇప్పటికీ వర్షాలు లేక కాలువలు, కుంటలు నిండకపోవడంతో ఏరువాక కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఈ సంవత్సరం ఎక్కువగానే వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో అన్నదాతలు తొలకరి జల్లుల కోసం వేచి చూస్తున్నారు. జిల్లా ధాన్యాగారంగా పేరొందిన కారంచేడు ప్రాంత మాగాణి రైతులతో పాటు మెట్ట రైతులు భూములను దుక్కులు చేసుకున్నారు.

అడపాదడపా కురిసిన వర్షాల వలన ఇంత వరకు ఎలాంటి ఉపయోగం చేకూరడం లేదు. జిల్లా ప్రధాన సాగు వనరులైన సాగర్, కొమ్మమూరు కాలువలకు సాగునీరు విడుదల విషయంలోనూ స్పష్టత లేదు. కారంచేడు మండలంలో ఇప్పటికే అక్కడక్కడ మినుము సాగు చూసిన రైతులు మిరప, పత్తి సాగుకు సన్నద్ధంగా ఉన్నారు. ఆగష్టు నెల మొదటి వారానికి నారుమళ్లు పోసుకోవడానికి సిద్ధమవుతున్నారు. సాగర్, కొమ్మమూరు కాలువలకు గత ఏడాది సాగుకు చుక్క నీరు విడుదల కాలేదు. ఈ ఏడాదైన వర్షాలు బాగా కురిసి రిజర్వాయర్లు నిండి కాలవలకు నీరు విడుదల చేస్తారని అన్నదాతలు ఆశపడుతున్నారు.

ఐదు లక్షల ఎకరాల్లో వరి ప్రశ్నార్థకమేనా..

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సాగర్ కాలువ పరిధిలో సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుంది. కొమ్మమూరు కాలువ పరిధిలో అధికారిక, అనధికారిక లెక్కల ప్రకారం లక్ష ఎకరాల వరి సాగు ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఎకరానికి సగటున 35 బస్తాలు వచ్చినా.. 1.75 కోట్ల క్వింటాళ్ళ ధాన్యం దిగుబడులను సాధిస్తారు. ఇప్పటికే బియ్య ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పేద ప్రజలకు అందనంత దూరంలో బియ్యం ధరలు కనిపిస్తున్నాయి. బీపీటీ 25 కేజీల బస్తా రూ. 1700 ఉంటే 92 రకం బియ్యం 25 కేజీల బస్తా రూ. 1600 వంతున విక్రయిస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలో 50 వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో వేయాల్సిన కంది, మొక్కజొన్న, పత్తి వంటి పంటలు పండకుండా పోయాయి. కేవలం బోర్లు కింద మాత్రమే మొక్కజొన్న సాగువుతోంది.

ఈ నెల 30 వరకు అవకాశం

ఇప్పటి వరకు సరైన వర్షాలు పడలేదు. ఈ నెల 30 వరకు ఖరీఫ్ కాలం ఉంది. మంచి వర్షాలు పడితే ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధం కావచ్చు.

ఏవో వెంకటకృష్ణ, అద్దంకి



వేటపాలెం: మాట్లాడుతున్న వైద్యాధికారి స్వాతి కిరణ్



మేదరమెట్ల: బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు



కారంచేడులో జాతీయ జనాభా ర్యాలీలో వైద్య సిబ్బంది

ఇద్దరు పిల్లలు ముద్దు

- ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

వేటపాలెం: ఇద్దరు పిల్లలు ఉండటం వల్ల కుటుంబాలు ఆనందంగా ఉంటాయని వైద్యాధికారి స్వాతి కిరణ్ పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో బాల్యవివాహాలు, కుటుంబ నియంత్రణల పై అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహిచారు. గర్భధారణ సమయంలో కాన్పుకు ఎడం ఉండేలా తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని సూచించారు. చీరాల పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ యాకబ్ మాట్లాడుతూ ప్రభుత్వ సేలను గర్భిణులు వినియోగించుకోవాలన్నారు. డాక్టర్ సాయి వైష్ణవి, సూపర్‌వైజర్ సుధాకర్, చీరాల సబ్ యూనిట్ అధికారి శేషుబాబు, సూపర్‌వైజర్ మార్తమ్మ, సిబ్బంది శిరోరాణి, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మేదరమెట్ల: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో చీరాల లక్ష్మీ, ఎం.వర్ష గెలుపొందారు. అలాగే అద్దంకి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో గొట్టిపాటి శశాంక్‌కు తృతీయ బహుమతి పొందాడు. వీరి ముగ్గురికీ శుక్రవారం బహుమతులు అందిస్తామని హెచ్ఎం రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని పమిడిపాడు జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఉదయం షేక్ సుల్తాన్ డ్రిల్ మాస్టర్ ఆధ్వర్యంలో ఫార్మసీ ఆఫీసర్ ఎంపీ రత్నకుమార్ అధ్యక్షతన ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తమ్మిశెట్టి ఎస్తేరు రాణి, కొండ్రు అమీష జెస్సీ, ఆశలు మరియమ్మ, లీలమ్మలు పాల్గొన్నారు. సదస్సు అనంతరం ప్రపంచ జనాభాను పురస్కరించుకొని ఫార్మసి ఆఫీసర్ ఎంపీ రత్నకుమార్ ఆధ్వర్యంలో హెడ్ మాస్టర్ అంజయ్య ర్యాలీని ప్రారంభించారు.



మేదరమెట్ల: ర్యాలీలో పాల్గొన్న ఫార్మసీ ఆఫీసర్, హెడ్ మాస్టర్ అంజయ్య



స్వర్ణలో మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కారంచేడు: సురక్షితమైన కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించడమే మేలని కారంచేడు పీహెచ్‌సీ డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం జాతీయ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన కారంచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిరోధ్, గర్భనిరోధక మాత్రలు, ఐయూడీ, మాల-ఎన్ మాత్రలు వంటివి వినియోగించుకోవాలన్నారు. అంబేద్కర్ నగర్‌లో 104 మెడికల్ క్యాంపును నిర్వహించారు. సూపర్‌వైజర్ డి. శ్రీనివాసరావు, జయశ్రీ, ఆలీష్‌కుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ ఎం శాలినీ, డాక్టర్ హస్మప్రియల ఆధ్వర్యంలో ప్రపంచ ర్యాలీ నిర్వహించారు. హెచ్‌వీ మాధురీసిఫోరా, ఎల్‌టీ బయ్యా శంకర్ పాల్గొన్నారు.

బ్రిటిష్ పాలన కంటే ఘోరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గాదె మధుసూదన్‌రెడ్డి



సభకు హాజరైన కార్యకర్తలు, నాయకులు

- వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన్ రెడ్డి

యద్దనపూడి: రాష్ట్రంలో బ్రిటిష్ పాలనకంటే బాబు హయాంలోని కూటమి ప్రభుత్వం దారుణమైన పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూధన్ రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని తనుబొద్దివారి పాలెం గ్రామంలో ఉన్న కె. పాల్, మస్తాన్‌రెడ్డి కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని పార్టీ మండలాధ్యక్షుడు రావూరి వేణుబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. గాదె మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయినా మేనిఫెస్టోలో చెప్పిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. రూ. 1.75 లక్షల కోట్లు అప్పులు చేసినా ప్రజల సంక్షేమానికి చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. రైతులకు భరోసా ఇవ్వకుండా ప్రభుత్వం చోద్యం చూస్తూ కూర్చుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రూ.7450 కోట్లు వారికోసమే వినియోగించారన్నారు. కూటమి ప్రభుత్వం రూ. 5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ఏడాదిపాలనలో నిరుద్యోగి భృతి, అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డలకు రూ.1500 ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు, 20 లక్షల ఉద్యోగాలు, 50 ఏళ్లకే వద్ధాప్య పింఛన్, ఇలా ఏ ఒక్కటి అమలుచేయలేకపోయారన్నారు. తల్లికి వందనం పథకానికి సవాలక్ష ఆంక్షలు పెట్టటంతో పాటు ఉచిత గ్యాస్ ఎవరికి అందుతుందో కూడా తెలియటం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలతో ప్రతి కుటుంబానికి 5 సంవత్సరాల్లో రూ.5.20 లక్షలు రావాల్సి ఉందన్నారు. దీని ప్రకారం ఈ ఏడాది లక్ష రూపాయలుగా ప్రతి కుటుంబానికి వచ్చాయో లేదో ప్రజలే పరిశీలించుకోవాలన్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి వారి సెల్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి చంద్రబాబు ఇచ్చిన హామీలను ఏ విధంగా ప్రజలను మోసం చేస్తారోనన్న విషయాన్ని వివరించాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు



వేమవరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై

బల్లిరవ: ఫ్యాక్షన్ గ్రామమైన వేమవరంలో రాజకీయ పార్టీలకు సంబంధించి ఫెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఎస్సై వై. నాగరాజు శుక్రవారం హెచ్చరించారు. జంట హత్యల నేపథ్యంలో 8 సంవత్సరాలుగా గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. గ్రామానికి చెందిన మూఢవత్ హరికృష్ణనాయక్ ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా శుక్రవారం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే ఎవరిపైనైనా చర్యలు తప్పవన్నారు. పలు వాహనాలను తనిఖీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చినగంజాం: మండలంలోని చినగంజాం, కొత్తపాలెం, పెదగంజాం విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా 12వ తేదీ శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పడవల గణనారాయణ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల, సోమవరప్పాడు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు.

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలో కొత్తగా నిర్మించిన విద్యుత్ టవర్ లైన్ల పనుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఏఈ యం. దామోదరం శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సుధ

చీరాల రూరల్: దీర్ఘకాలంగా కోర్టుల్లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం (మీడియేషన్) ద్వారా పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు భవన సముదాయంలో మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలనే అంశంపై కక్షిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కక్షిదారులకు ఆమోదయోగ్యంగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం చేయనున్నట్లు చెప్పారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకట వాహిని, న్యాయవాదులు, పీఎల్‌వీలు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరీ రూపంలో జ్వాలాముఖి అమ్మవారు

ఒంగోలు మెట్రో: స్థానిక పెళ్లూరులోని శ్రీ గురునాథేశ్వరస్వామి సమేత జ్వాలాముఖి అనుగ్రహ శక్తిపీఠంలో అమ్మవారిని శుక్రవారం శాకాంబరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దేవస్థాన ఆవరణతో పాటు అంతరాలయాన్ని, గర్భాలయాన్ని జ్వాలాముఖి మూలమూర్తిని, ఉత్సవమూర్తిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో చక్కగా అలంకరించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి కుంకుమార్చన నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాద్ స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి భాస్కరరావు

పర్చూరు(చినగంజాం): మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ మేకా ఆనందకుమారి కోరారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ సమావేశ హాలులో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులంతా సమన్వయంతో పని చేయాలని.. ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారి కె. భాస్కరరావు మాట్లాడుతూ పొగాకు కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల వద్ద ఉన్న చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తారన్నారు. గతంలో ఇన్‌కం టాక్స్ చెల్లించిన రైతులకు జాబితాలో పేర్లు రావన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్ మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువులు నీరు బాగోలేదని అనిపిస్తే వెంటనే ఆ నీటిని పరీక్షలకు పంపించాలన్నారు. కేడబ్ల్యూడీ కెనాల్ నుంచి వచ్చే నీటిని చెరుకూరు, రమణాయపాలెం, కొత్తపాలెం, పోతుకట్ల, వీరన్నపాలెం గ్రామాల చెరువులు నింపుకోవాలని సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు వరిగి తీగలు కిందకు వేల్లాడుతున్నాయని ఏఈ రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఎంఈఓ వెంకటరామయ్య మాట్లాడుతూ తల్లికి వందనం రాకపోతే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎంపీడీఓ వి. ప్రద్యుమ్న కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా లింకు రోడ్ల నిర్మాణాలు చేపడతారని తెలిపారు. వెలుగు ఏపీఎం రామకృష్ణ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హౌసింగ్ ఏఈ రమేష్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు సహకరిస్తామని తెలిపారు. తమకు గత 21 నెలల నుంచి గౌరవ వేతనం ఇవ్వడం లేదని ఎంపీటీసీలు.. ఎంపీడీఓ దృష్టికి తీసుకువచ్చారు.

మొక్కలతో పర్యావరణానికి రక్ష



మొక్కలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

అద్దంకి రూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మైలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. నాగేశ్వరరావు అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులకు తల్లి పేరుతో మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి ఆవరణలో మొక్కనాటి దాని ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు వి. రమేష్, యం. వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి, వెంకట పద్మావతి పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ



కారంచేడులో శిక్షణనిస్తున్న ఈఆర్‌ఓ లవన్న

కారంచేడు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో విధులు నిర్వహించే బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని బాపట్ల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పర్చూరు నియోజకవర్గ ఈఆర్‌ఓ లవన్న అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు ఎంపీడీఓ కార్యాలయ సమవేశ మందిరంలో నిర్వహించిన ఒక్క రోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఢిల్లీలో ప్రత్యేక శిక్షణను పొందిన ఏఎస్‌ఓ శ్రీమన్నారాయణ బీఎల్‌ఓలకు శిక్షణనిచ్చారు. తహసీల్దార్ జి. నాగరాజు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత పాల్గొన్నారు.

రెవెన్యూ లక్ష్యాలు పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బల్లికురవ: రైతులు, ప్రజలకు అందించాల్సిన సేవలను సకాలంలో అందిస్తూ ప్రభుత్వ లక్ష్యాలు పూర్తి చేయాలని తహసీల్దార్ రవినాయక్ రెవెన్యూ సిబ్బందిని కోరారు. శుక్రవారం రాత్రి స్థానిక కార్యాలయంలో ఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బందితో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని.. నీటి తీరువా వసూళ్లు, రీ సర్వే, బీఎల్ఆర్, కౌలు రైతుల గుర్తింపు కార్డులు, గ్రామాల వారీ ఖాళీ ఇంటి స్థలాలపై సమీక్షించారు. డీటీలు రవికుమార్, ప్రహర్ష మాట్లాడారు.

దివ్యాంగ చిన్నారులను ఆదరించండి



జె.పంగులూరు: దివ్యాంగులకు అందించిన ఉపకరణాలతో అధికారులు

జె.పంగులూరు: దివ్యాంగ చిన్నారులకు మంచి భవిష్యత్ అందించాలని ఎంఈఓ వీరాంజనేయులు అన్నారు. పంగులూరు భవిత కేంద్రంలో శుక్రవారం ఉపకరణాలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి, హెచ్ఎం సోమేపల్లి శ్రీనివాసరావు, కంకణాల శ్రీనివాసరావు, గుర్రం లక్ష్మి, ప్రసాద్, యోహాన్, అరుణ గ్రామస్తులు పాల్గొన్నారు.



చినగంజాం: దివ్యాంగులకు బియ్యం అందజేస్తున్న దాతలు

చినగంజాం: దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షులు విశ్రాంతమ్మ, ఏపీఎం సబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో 15 మందికి వినికిడి యంత్రాలను, ఇద్దరికి ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు అందజేశారు. ఉపాధ్యాయులు ఆర్. పోతురాజు, శ్రీనివాస రెడ్డి బియ్యం అందజేశారు. చినగంజాం ఉప సర్పంచ్ సీహెచ్ రాఘవయ్య, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శారద, పాద వీరయ్య, సారథి పాల్గొన్నారు.